1

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

సోమవారం | నవంబర్ 25, 2024 | www.navatelangana.com

ప్రశాంతంగా ముగిసిన ఎన్ఎంఎంఎస్ పరీక్ష

నవతెలంగాణ-కామారెడ్డి

నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష కామారెడ్డి డివిజన్‌లో 04 కేంద్రాలలో, బాన్సువాడ డివిజన్‌లో 02 కేంద్రాలలో ఆదివారం నిర్వహించారు. కాగా ప్రశాంతంగా ముగిసినట్టు జిల్లా విద్యాశాఖ అధికారి రాజు తెలిపారు. ఈ పరీక్షకు1202 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, 1161 మంద హాజరయ్యారనీ, 41 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు తెలిపారు.



సీఐల బదిలీలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

మల్టీ జోన్-1 పరిధిలో తొమ్మిది మంది సీఐలు బదిలీ అయ్యారు. ఆదివారం ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఐజీపీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న పలువురికి పోస్టింగ్ ఇచ్చారు. మల్టీ జోన్ 1 డీజీపి కార్యాలయం వెయిటింగ్‌లో ఉన్న సతీష్ కుమార్‌ను నిజామాబాద్ సిసిఆర్‌బికి, డిసిఆర్‌బి ఆదిలాబాద్‌లో ఉన్న పబ్బా ప్రసాద్‌నూ నిజామాబాద్ ట్రాఫిక్ ఎస్‌హెచ్‌వోగా, ట్రాఫిక్ ఎస్‌హెచ్‌వోగా వీరయ్యను నిజామాబాద్‌కు బదిలీ చేశారు. జగిత్యాల సీసీఎస్‌లో ఉన్న లక్ష్మీనారాయణను మానకొండూర్‌కు, మానకొండూర్ ఎస్‌హెచ్‌వో సాధన్ కుమార్‌ను రాజన్న సిరిసిల్ల సీసీఎస్‌కు, వెయిటింగ్‌లో ఉన్న అల్లం రాంబాబును నిర్మల్ డీఎస్‌బీకి, మున్నూరు క్రిష్ణను నిర్మల్ సీసీఎస్ కు, నరహరి నిర్మల్ డీసీఆర్ బీకి బదిలీ అయ్యారు.

బస్తాల వద్ద కాపలా

చలికి గజ గజ వణుకుతున్న రైతులు

- తూకం వేసిన ధాన్యం తరలించడంలో రైస్‌మిల్లర్ల జాప్యం
- అన్‌లోడ్ చేసుకోకపోవడంతో ఎక్కడికక్కడ నిలచిన లారీలు
- అదనంగా తరుగు ఇస్తేనే దించుకుంటామనే షరతు..?

నవతెలంగాణ-లింగంపేట్

ఈసారి ధాన్యం విక్రయాల్లో రైతులకు అడుగడుగునా అడ్డంకులే ఎదురవుతున్నాయి. పంట చేతికి వచ్చి కోతలు కోసి కొనుగోలు కేంద్రాలకు తరలించినా.. ప్రభుత్వం తూకం ప్రారంభించలేదు. రైస్‌మిల్లర్ల సమస్యవల్ల.. సకాలంలో కాంటా చేయలేదు. దీంతో కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చిన రైతులు సుమారు 20 నుంచి 30 రోజుల వరకు ఎదురుచూశారు. ఎట్టకేలకు రైస్‌మిల్లుల కేటాయింపు పూర్తి చేసి తూకం ప్రారంభించడంతో ప్రారంభంలో సాఫీగా సాగింది. కానీ మళ్లీ రైతులకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. తాజాగా తూకం వేసిన ధాన్యం తరలించకపోవడంతో బస్తాల్లోనే కేంద్రాల వద్ద నిలిచిపోయాయి. ఆరా తీస్తే లారీలు రావట్లేదని సమాచారం. అయితే రైస్‌మిల్‌కు తరలించిన ధాన్యం అన్‌లోడ్ చేయడంలో రైస్ మిల్లర్లు ఆలస్యం చేస్తున్నట్టు సమాచారం. రంగు మారిందని, తాలు ఉందని ఇతరాత్ర కారణాలు చెప్తూ అదనంగా తరుగు కోసం ఆలస్యం చేస్తున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీంతో తమ ధాన్యం బస్తాల వద్ద రైతులకు పడిగాపులు తప్పడం లేదు. రాత్రి వేళల్లో చలికి గజగజ వణుకుతూ తప్పని పరిస్థితుల్లో అక్కడే ఉండాల్సి వస్తుంది. అనేక అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. ఆరోపణలు, ప్రత్యారోపణలకే పరిమితమైన పాలకులకు, నాయకులకు రైతుల కష్టాలు కనిపించకపోవడం గమనార్హం.

జిల్లావ్యాప్తంగా ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంతో పౌరసరఫల శాఖ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఇందిరా గాంధీ పథక శాఖల ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టింది. జిల్లావ్యాప్తంగా ఖరీఫ్ సీజన్లో వరి 2 లక్షల 18 ఎకరాలలో సాగైంది. పంటను సేకరించేందుకు జిల్లాలో 423 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ధాన్యం తరలించేం దుకు 179 రైస్ మిల్ల కేటాయించారు. రవాణా లో ఇబ్బంది కలగకుండా 250 లారీలను ఏర్పాటు చేశారు.

మిల్లర్ల కొర్రీలు

కొనుగోలు కేంద్రాల వద్ద నెలల తరబడి కాపలా ఉండాల్సి వస్తుందన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం వెంటనే తరలించకుండా 15 రోజులు గోనె సంచుల్లో నింపి అక్కడే ఉంటున్నాయని లారీలు సకాలంలో రాకపోవడం వల్ల రైస్ మిల్లు వద్ద లారీలు ఉన్నటువంటి బస్తాలను దింపుకోవడంలో జాప్యం చేయడం వల్ల రైతులకు తిప్పలు తప్పడం లేదంటున్నారు. అదేవిధంగా ఇప్పటివరకు తేమ శాతం వచ్చిన కొనుగోలు కేంద్రానికి ధాన్యం తరలించి 20 రోజులైనా తూకం వేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైస్‌మిల్లర్లు ధాన్యం దించుకోవడం లేదని రైతులు పేర్కొంటున్నారు.ఎక్కువగా ఎండబెట్టడం వల్ల ధాన్యం రంగు మారిందని కొర్రీలు పెడుతున్నట్టు వాపోతున్నారు. అదనంగా తరుగు తీసేందుకు అనేక కొర్రీలు ముందుకు తెస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చలికి గజ గజ

జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడికి కుప్పలు అక్కడే దర్శనమిస్తున్నాయి. ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్, లింగంపేట్, రామారెడ్డి, రాజంపేట, మాచారెడ్డి, భిక్కనూర్ మండలాలతో పాటు తదితర మండలాల్లో గ్రామాల్లో ఏర్పాటు చేసినటువంటి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు దర్శనమిస్తున్నాయి. తూకం నత్త నడకన కొనసాగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు తూకం వేసిన ధాన్యం బస్తాలు అడుగడుగున దర్శనమిస్తున్నాయి.

రాత్రి వేళలో చలి తీవ్రత ఉండడతో రైతులు ధాన్యంకుపల వద్ద మంట పెట్టుకొని కాపలాగ ఉంటున్నామని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కుప్పల వద్ద కాపలాగా లేకపోతే పందులు పశువులు వచ్చి ధాన్యాన్ని ధ్వంసం చేస్తున్నాయిని ఆవేదన చెందుతున్నారు. దీంతో పాటు చోరీలు జరిగే అవకాశం ఉంటుండటంతో అక్కడే కాపలా ఉంటున్నారు. చలి తీవ్రతకు సర్ది జ్వరం తలనొప్పి వస్తుందని రోజుల తరబడి ధాన్యం కుప్పలు వద్దనే పడిగాపులు కాస్తున్నామని వారు వాపోతున్నారు.

జిల్లాలోని లింగంపేట మండలంలో లింగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో 15 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. భవానిపేట్ శెట్టిపల్లి పర్మల్ల పోతాయిపల్లి లింగంపేట ఐలాపూర్ గ్రామాలలో 60 శాతం కొనుగోలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. తూకం వేసిన ధాన్యం బస్తాలు తరలించడంలో అధికారులు విఫలమవుతు న్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా 3 లక్షల1 961 బస్తాల ధాన్యం 1982 రైతుల వద్ద నుండి కొనుగోలు చేశామని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సిబ్బంది అంటున్నారు. మరో 40 శాతం దాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది.



బస్తాల వద్ద చాలికాచుకుంటున్న రైతులు



తూకం వేసి తరలించేందుకు సిద్ధంగా ఉన్న బస్తాలు..



తూకం చేయకపోవడంతో కుప్పలుగా ధాన్యం

చర్మరోగులకు గైనకాలజిస్ట్ వైద్యం

- సదరు వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో వైద్య చికిత్సలు నిర్వహిస్తున్న స్త్రీవైద్య నిపుణురాలైన ఆయన భార్య
- ఓ ప్రయివేటు ఆస్పత్రిలో తీరు
- ఆలస్యంగా తెలుసుకొని నివ్వెరపోతున్న రోగులు
- వైద్యాధికారులు తనిఖీలు చేపడితే ఇలాంటివి వెలుగుజూసే అవకాశం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సాధారణంగా జ్వరం, సర్ది లాంటివి వస్తే మెడికల్‌కు వెళ్లి అడిగితే మందుగోళీలు ఇస్తుంటారు. కానీ చర్మ సంబంధిత వ్యాధులకు మెడికల్ నిర్వహకులు సైతం వైద్యుడి ప్రిస్కిప్షన్ లేనిదే మందులు ఇవ్వరు. ఎందుకంటే సరైన మందులు ఇవ్వకపోతే రియాక్షన్ అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. దీంతో ఫార్మసిస్టులు.. సదరు మందుల పేర్లు, లేకుంటే వైద్యుడి చిట్టీ ఉంటేనే మందులు ఇస్తుంటారు. అలాంటి చర్మ రోగాలకు సంబంధించి డెర్మటాలజీస్ట్ వైద్యం చేయాల్సి ఉండగా నిజామాబాద్ నగరంలోని ఓ ఆస్పత్రిలో సదరు వైద్యుడి స్థానంలో ఆయన భార్య గైనకాలజిస్ట్ (స్త్రీ వైద్య నిపుణురాలు) వైద్య చికిత్సలు నిర్వహిస్తుండటం గమనార్హం. రోగమొకటైతే.. వైద్యం మరోటి అందుతున్న చందంగా అక్కడ ట్రీట్‌మెంట్ కొనసాగుతుంది. ఆలస్యంగా గమనిస్తున్న పలువురు రోగులు.. తర్వాత పెదవి విరుస్తున్నారు. సదరు స్పెషలిస్ట్ లేకున్నా.. చికిత్స నిర్వహిస్తున్న ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని రోగులు డిమాండ్ చేస్తున్నారు.

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఖలీల్‌వాడీలోని ఓ ఆస్పత్రిలో పేరుగాంచిన చర్మవైద్య నిపుణులు గతేడాది ఏప్రిల్ నుంచి బ్రెయిన్ స్ట్రోక్‌తో మంచానికే పరిమితమైయ్యారు. కాగా సదరు వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో వైద్యురాలు అయిన ఆయన భార్య.. చర్మరోగులకు చికిత్సలు అందిస్తున్నారు. కానీ ఆమె గైనకాలజీస్ట్(స్త్రీ వైద్య నిపుణులు) స్పెషలైజేషన్ చేసి చర్మ రోగులకు చికిత్సలు అందిస్తుండటం గమనార్హం. ఆస్పత్రికి వచ్చే రోగులకు చర్మ వైద్యులు లేరు అని సమాధానం చెప్పకుండా, అదే ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందే రోగులకు, చర్మ వైద్య నిపుణులు ఎవరు అని తెలియక పోవడంతో.. అదే భవనంలో ఉండే మరొక డాక్టర్ స్త్రీ వైద్య నిపుణులు అయినటువంటి డాక్టర్, చర్మవ్యాధి చికిత్సకు సంబంధించిన మందులను రాసి ఇస్తున్నారు. సదరు స్త్రీ వైద్య నిపుణులు గతంలో ప్రభుత్వ ఉద్యోగిగా, స్త్రీలకు వైద్య సేవలు అందించి వైద్యులుగా రిటైర్మెంట్ పొంది రెండు సంవత్సరాలు అయింది. కాగా ప్రస్తుతం ఆమె భర్త స్థానంలో వైద్య చికిత్సలు అందజేస్తున్నారు.

కాగా ఆస్పత్రికి వచ్చే రోగులకు నయం కాకపోవడంతో ఇతర ఆస్పత్రులకు వెళ్తే.. అసలు విషయం తెలుస్తుంది. దీంతో వైద్యుల తీరుపై మండిపడుతున్నారు. మరికొందరు అదే ఆస్పత్రికి వస్తూ చర్మ సంబంధిత వ్యాధులు తగ్గక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై వాట్సప్ గ్రూప్‌లో పోస్టులు వైరల్‌గా మారుతున్నాయి. వైద్యశాఖ అధికారులు స్పందించి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు. సక్రమమైన వైద్యం అందక.. ఏదైనా అనుకోని ఘటనలు జరిగకముందే అధికారులు స్పందంచాలని కోరుతున్నారు.





రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్



మాట్లాడుతున్న చంద్రశేఖర్

నవతెలంగాణ-కామారెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ కె. చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. కామారెడ్డిలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియం (సీఐటీయూ) జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన హాజరైయ్యారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షులు సురేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్వాడీలకు ఇచ్చిన హామీ అమలు చేయకుండా రోజుకొక కొత్త పనులు పెడుతూ పని భారాన్ని మోపుతున్నారే తప్ప పనికి తగ్గట్టు వేతనాలు ఇవ్వడం లేదని తెలిపారు. క్రష్ సెంటర్స్ పేర్లతో అంగన్వాడి సెంటర్లలో జాతీయ నూతన విద్య విధానం కార్మికులకు తెలియకుండానే అమలుపరిచే ధోరణి తప్ప అంగన్వాడీలను మార్పు పేరుతో సీసీ కెమెరా, బయోమెట్రిక్ అంగన్వాడి సెంటర్లలో ఎల్కేజీ, యూకేజీ అంటూ అంగన్వాడీలను అయోమయానికి గురి చేస్తున్నారన్నారు. అంగన్వాడీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని, వ్యక్తిగత మరుగుదొడ్లు, భవనం లేని సెంటర్స్‌కు కొత్త భవనం నిర్మించాలని, అంగన్వాడీలకు కనీస వేతనం. 26 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అంగన్వాడీలకు అదనపు పని భారాలు పెంచుతూ బి ఎల్ ఓ, కుటుంబ సర్వే లాంటివి పనిభారాలు పెంచుతూ వీరికి వచ్చే పాత టీఏడీఏలు, హౌస్ రెంట్ బిల్లులు, కూరగాయల బిల్లులు, ఈవెంట్స్ బిల్లులు ప్రతి అంగన్వాడీ కేంద్రానికి ప్రభుత్వం ప్రింట్ చేసిన రిజిస్టర్స్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రిటైర్మెంట్ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్‌లకు ప్రభుత్వం ప్రకటించిన విధంగా టీచర్స్‌కు రెండు లక్షల రూపాయలు, హెల్పర్లకు లక్ష రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.మినీ అంగన్వాడి కేంద్రాలకు హెల్పర్స్ లను నియమించాలన్నారు. సీనియారిటీ కలిగి ఉన్న హెల్పర్లకు టీచర్లుగా ప్రమోట్ చేయాలనీ, రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వీ కల్పన, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. బాబాయ్, జిల్లా ఉపాధ్యక్షురాలు బిలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి ఆర్. అనసూయ, జిల్లా కమిటీ సభ్యులు సురేఖ రాణి, శోభారాణి, అంగన్వాడీ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బీజేపీ ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం

- 26న జిల్లాలో జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి
- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి ప్రసాద్

నవతెలంగాణ-కంఠేశ్వర్

కేంద్ర బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి ప్రసాద్ అన్నారు. ఆదివారం సిఐటియు కార్యాలయంలో 26న నిరసన కార్యక్రమాలు కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి సంకీర్ణ ప్రభుత్వం కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నది. కార్పొరేట్ల ప్రయోజనం కోసం దేశ స్వాతంత్ర్యాన్ని, స్వావలంబనను తాకట్టు పెడుతున్నది. నిత్యం స్వదేశీ జపం చేస్తూ విదేశీ సంస్థలకు సాగిలపడుతుంది. మన జాతీయ వనరులు, సంపదను లూటీ చేస్తున్నది. నయా ఉదారవాద సంస్కరణలను దూకుడుగా కొనసాగించడానికి 100 రోజుల లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. అందుకే తమకు ప్రజలు అధికారాన్ని కట్టబెట్టారని మోడీ ప్రభుత్వం చాటుకుంటుంది. లేబర్ కోడ్లను నోటిఫై చేయడం, భారతీయ న్యాయ సంహిత-2023 (బిఎన్ఎస్)ను అమలు చేయడం, నేషనల్ మానిటైజేషన్ పైప్లైన్ ద్వారా కార్పొరేట్, పెట్టుబడిదారుల, బడావ్యాపారస్తులు ఆర్థిక వెసులుబాట్లకు కల్పించే చర్యలను వేగవంతం చేసింది. పరిపాలనలోకి వచ్చిన 20 రోజుల్లోనే మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం దేశవ్యాప్తంగా 8 మంది మైనారిటీ మతస్తుల మీద మూకదాడులకు దిగడం ద్వారా ఆర్ఎస్ఎస్, దాని హిందుత్వ మత శక్తులు తమ మత విద్వేష ఎజెండాను అమానుషంగా కొనసాగిస్తున్నది. ఈ నేపథ్యంలో 10 జాతీయ కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కెఎం) వ్యవసాయ కార్మిక సంఘాలు ఐక్యంగా దేశవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చాయి. అందులో భాగంగా రాష్ట్రంలో నవంబర్ 15-25 వరకు రాష్ట్ర వ్యాప్తంగా కరపత్రాల పంపిణీ, సభలు, సమావేశాల ద్వారా ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు విస్తృత ప్రచారం చేసి, నవంబర్ 265 అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో నిరసనలు చెయ్యాలని పిలుపుని చ్చాయి. రాష్ట్రంలోని కార్మికులు, రైతాంగం, వ్యవసాయ కార్మికులు, యావత్ శ్రమజీవులు వేలాదిగా పాల్గొనాలని' పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శంకర్ గౌడ్, నూర్జహాన్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి వెంకటేష్, సిఐటియు జిల్లా సహ కార్యదర్శి నన్నేసాబ్, మోహన్, జిల్లా నాయకులు గణేష్, గంగాధర్, కటారి రాములు, నరసయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వివిధ కార్మిక ప్రజాసంఘాల నాయకులు

కష్టపడిన వారికి విస్మరించి పార్టీ మారివచ్చిన వారికే పదువులు

- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌కు ఎమ్మెల్యే మదన్మోహన్‌రావుపై ఫిర్యాదు

నవతెలంగాణ-రామారెడ్డి

ఎల్లారెడ్డి నియోజకవర్గ శాసనసభ్యులు మదన్మోహన్ రావు పార్టీ కోసం కష్టపడిన వారికి కాకుండా పార్టీ మారి వచ్చిన వారికి పదవులు కట్టబెడుతున్నారని, కనీస ప్రొటోకాల్ సైతం పాటించటం లేదని నియోజక వర్గ నాయకులు ఆరోపించారు. శనివారం రాత్రి టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కు ఎల్లారెడ్డి నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. 20 సంవత్సరాల నుండి కష్టపడిన కార్యకర్తలు గుర్తింపు లేదని ప్రశ్నిస్తే గుండా గిరి చేసి, దూషిస్తూ దాడులు చేస్తున్నారని, స్థానికంగా ఉండకుండా ఎమ్మెల్యే విదేశీ పర్యటనలో ఉంటూ, నాయకులతో కాకుండా వ్యక్తిగత సిబ్బందితో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. క్యాంప్ కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేయకుండా, పార్టీ కార్యక్రమాలను, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి వేడుకలను కూడా నిర్వహించలేని దుస్థితిలో నియోజకవర్గం ఉందని తెలిపారు. ప్రతిపక్షాలు ధర్నాలు ర్యాలీలతో పాటు, ప్రభుత్వంపై, పార్టీపై ఆరోపణలు చేస్తే ఏ ఒక్క రోజూ కౌంటర్ ఇచ్చిన దాఖలాలు లేవని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గీరెడ్డి మహేందర్‌రెడ్డి, నా రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నియోజకవర్గంలోని వివిధ మండలాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వలస కూలీ.. బతుకు ప్రయాణం

చెరుకు నరికేందుకు ఇతర ప్రాంతాల నుంచి వలస

నవతెలంగాణ-లింగంపేట్

ఉన్న ఊరును కన్నతల్లిని పిల్లజల్లాను వదిలి బతుకుదెరువు కోసం వలస కూలీలు బతుకు ప్రయాణం చేస్తున్నారు. పొట్టకూటికోసం భూములను వదిలి ఇండ్ల వద్ద వృద్ధులను కాపలాగ ఉంచి పిల్లాపాపలతో ముల్లెమూట సర్దుకొని బతుకు ప్రయాణం మొదలుపెట్టారు. వందలాది కిలోమీటర్‌ల దూర ప్రాంతాల చెరుకు వలస కూలీలు పెద్ద ఎత్తున కామారెడ్డి జిల్లాకు తరలివస్తున్నారు.

కామారెడ్డి జిల్లా సమీపంలోని గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ చెరుకు క్రషింగ్ ప్రారంభమైంది. ఈ ప్రాంతంలో కామారెడ్డి జిల్లాలో చెరుకు పంట సాగు చేసే రైతులు అధికంగా ఉన్నారు. చుట్టుపక్క గ్రామాల్లో సుమారు 4 వేల 500 ఎకరాలు చెరుకు పంటను సాగు చేస్తున్నారు. రైతుల పండించిన చెరుకును ఫ్యాక్టరీకి తరలించేందుకు చెరుకు నరికే కూలీలు అవసరం. ఇక్కడ ప్రాంతంలో చెరుకునారికే కూలీలు లేకపోవడంతో జహీరాబాద్ నారాయణఖేడ్ జుక్కల్ కంగిటి మిన్పూర్ అల్లాదుర్గం కోడప్‌గల్, మద్నూర్, మరికిల్ టేక్మాల్ తదితర ప్రాంతాల నుండి చీమలపాడు తదితర గ్రామాలను గిరిజనులు 1500 కుటుంబాలకు పైగా తరలివచ్చారు. నాలుగు నెలల పాటు చెరుకు ఫ్యాక్టరీకి తరలించడంలో నిమగ్నమవుతున్నారు. డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి, మార్చ్ మొదటి వారం వరకు చెరుకు నరకడం, ఫ్యాక్టరీకి తరలించే పనుల్లో నిమగ్నమవుతారు. ఒక్కొక్క కుటుంబంలోని ఇద్దరు లేదా ముగ్గురు చొప్పున రోజుకు మూడు టన్నులు చెరుకును నరికి ఎడ్లబండ్ల పై ఫ్యాక్టరీకి తరలిస్తుంటారు.

టన్నుకు 630 రూపాయల చొప్పున కూలీలకు చెల్లిస్తుంది. ఇంటిల్లిపాది కష్టపడితే రోజుకు 1000 రూపాయల వరకు కూలీ పడుతుంది. ఉదయం నుండి ఆడ మగ తేడా లేకుండా సాయంత్రం వరకు చెరుకు నరికి ఎడ్లబండ్లపై ట్రాక్టర్‌లో చెరుకు తరలించడం వీరి బాధ్యత. ఒక్కొక్క కుటుంబం మూడు నెలల పాటు సుమారు 90 వేల నుంచి లక్ష రూపాయల వరకు సంపాదిస్తారు. చలిని సైతం లెక్కచేయకుండా గుడిసెలు వేసుకుని మూడు నెలల పాటు జీవనం కొనసాగిస్తారు.



ఎడ్లబండ్లతో వస్తున్న కార్మికులు



మధ్యలో పలు చోట్ల సేద తీరుతూ..

వసతి గృహాలను తనిఖీ చేసిన అధికారులు



నవతెలంగాణ-బాల్కొండ

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పలు వసతి గృహాలను అధికారులు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర్, మండల పంచాయతీ అధికారి గంగా మోహన్ మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల వసతి గృహన్ని సందర్శించారు. వసతి గృహంలో అమలవుతున్న మెనూ ప్రకారం విద్యార్థులకు అందిస్తున్న భోజనంపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వంటగదిలోని పదార్థాల నిల్వలను తనిఖీ చేశారు. అనంతరం ఎంఇఓ ఆదర్శ పాఠశాల బాలికల వసతిగృహం, బాలుర వసతి గృహాలను సందర్శించి విద్యారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఇఓ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని అన్నారు.

భారతి నృత్యానికేతన్ చిన్నారుల ప్రతిభ



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి భారతి నృత్యానికేతన్ చిన్నారులు శ్రీ బాసర జ్ఞాన సరస్వతి దేవాలయంలో జరిగిన కార్యక్రమంలో అత్యంత ప్రతిభ కనబరిచినట్టు నాట్య గురువు సరోజ సుధీర్ ఆదివారం తెలిపారు. కార్తీక మాస కార్యక్రమంలో భాగంగా బాసరలోని వేద మండపంలో శనివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో 25 మంది విద్యార్థులు పాల్గొని నాట్య ప్రదర్శన చేసి చూపరులను మంత్రముగ్ధులు చేశారని పేర్కొన్నారు. బాసర దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిటీకి, ప్రోత్సహించిన తల్లిదండ్రులకు ఈ సందర్భంగా నాట్య గురువు ధన్యవాదాలు తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ



ద్విచక్రవాహనాన్ని చోరీ చేస్తుండగా.. సీసీ కెమెరాలోరికార్డైన దృశ్యాలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని రెండవ పోలీస్ స్టేషన్ పరిధిలో గల పెద్ద బజార్ చౌరస్తాలో ఆదివారం వేకువజామున ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. ప్రధాన చౌరస్తాలోని జెర్సీ పాల వ్యాపారి విజయ్ సంగ్వాయికి చెందిన వాహనం చోరీకి గురైంది. సుమారు తెల్లవారుజామున 3:09 గంటల సమయంలో చోరీ జరిగినట్లు సీసీ కెమెరాలో రికార్డయ్యింది. ఆయన లేచి చూసేసరికి వాహనం కనిపించలేదు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో నిక్షిప్తమయ్యాయి. బాధితుడు రెండవ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్పందన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం


మాట్లాడుతున్న వైద్యులు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తడపాకల్ గ్రామంలో స్పందన ఫౌండేషన్ ఆధ్వర్యంలో అపర్ణ హాస్పిటల్ వారు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారని, దాదాపు 200 మందికి టెస్టులను నిర్వహించి, ఉచితంగా మందులను అందజేశారని స్పందన ఫౌండేషన్ వ్యవస్థాపకులు నలిన్ ఇల్లెందుల తెలిపారు. ఇందులో భాగంగా వైద్యులు ప్రకాష్, అపర్ణ, అమర్నాథ్, తడపాకల్ మాజీ సర్పంచ్ పత్తిరెడ్డి ప్రకాష్, అంకం జ్యోతి ఫౌండేషన్, కరుణ ట్రస్ట్ ఫౌండేషన్ వారు పాల్గొన్నారు.

క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌సిసి దినోత్సవం


ఎన్‌సిసి దినోత్సవంలో పాల్గొన్న కళాశాల బృందం, కెడెట్స్

నవతెలంగాణ-ఆర్మూర్

క్షత్రియ కళాశాల ఆఫ్ ఇంజినీరింగ్ 75 ఎన్‌సీసీ దినోత్సవాన్ని శనివారం ఎంతో ఉత్సాహంతో నిర్వహించారు. 12వ తెలంగాణ బెటాలియన్ ఎన్‌సీసీ జిల్లా కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ విష్ణు నయార్ ఆదేశంతో ఎన్‌సీసీ కేడెట్‌లు స్వచ్ఛ భారత్ అభియాన్‌లో భాగంగా మండలంలోని గోవింద్‌పేట్ గ్రామంలో, క్షత్రియ ప్రాగణంలో మొక్కలు నాటారు. వివిధ కార్యకలాపాల ద్వారా వారి క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ నైపుణ్యాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల మేనేజ్‌మెంట్ ట్రెజరర్ అల్జాపూర్ గంగాధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్‌కె పాండే, ఎన్సిసి అధికారి లెఫ్టినెంట్ వెంకటేష్, ఇంచార్జ్ అండ్ టీమ్, కళాశాల అధ్యాపక బృందం, ఎన్‌సీసీ క్యాడెట్స్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌ను సందర్శించిన ఎంపీడీవో


భోజనశాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని చౌట్‌పల్లి గ్రామంలో గల బిసి హాస్టల్లో ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను, హాస్టల్ గదులను, భోజనశాలను, మరుగుదొడ్లు మూత్రశాలలను ఆయన పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వసతి గృహంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఈ సందర్భంగా విద్యార్థులకు ఎంపీడీవో సూచించారు. వసతి గృహంలో ఆర్వో ప్లాంట్, ఇన్వర్టర్, బోరు, మరుగుదొడ్ల ఇబ్బందులున్నాయని ఈ సందర్భంగా వసతి గృహం వార్డెన్ భోజేందర్ ఎంపీడీవో దృష్టికి తీసుకువచ్చారు. వసతి గృహంలోని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఎంపీడీవో తెలిపారు. వసతి గృహంలో సౌకర్యాలు, విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రానికి చెందిన కోటగిరి రాజు అనారోగ్య కారణంతో ఐదు రోజుల క్రితం మరణించడంతో ఈ విషయం తెలుసుకున్న మెండోరా మండల విశ్వబ్రాహ్మణ సంఘం మండలాధ్యక్షులు తంగెనపల్లి సురేందర్ రూ.2 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా విశ్వబ్రాహ్మణ కార్యవర్గ సభ్యులు కస్తూరి రాజేశ్వర్, ముప్కాల్ విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షులు టి.మహేష్, సెక్రెటరీ నవీన్ చారి, కోశాధికారి ఓజా గంగాధర్, సలహా సభ్యులు తాడురి గంగాధర్, పక్షి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల హననానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి

- మానవ హక్కుల వేదిక రాష్ట్ర పూర్వ అధ్యక్షులు గొర్రెపాటి మాధవరావు

నవతెలంగాణ-బోధన్

మానవ హక్కుల హననం ఏకోణంలో జరిగినా వాటికి వ్యతిరేకంగా సంఘటితమై ఉద్యమించాలని మానవహక్కుల వేదిక రాష్ట్ర పూర్వ అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది గొర్రెపాటి మాధవరావు అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలోని లయన్స్ కంటి ఆసుపత్రి ఆడిటోరియం హాల్‌లో నిర్వహించిన మానవ హక్కుల వేదిక 7వ జిల్లా మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక హక్కులుగా గుర్తించిన జీవించే హక్కు, భావ ప్రకటన స్వేచ్ఛ, నేటి ప్రజాస్వామిక వ్యవస్థలో



మాట్లాడుతున్న గొర్రెపాటి మాధవరావు

అపహాస్యం పాలవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ దార్శనికులు కలలుగన్న సమానత్వం, స్వేచ్ఛ, హక్కులు మసకబారుతున్నాయని పేర్కొన్నారు. రాజ్యాంగ లక్ష్యాలు సాధించాలని ప్రభుత్వాలు కర్తవ్యంగా గుర్తించడం లేదని తెలిపారు. ప్రశ్నించే గొంతుకలను ప్రభుత్వాలు క్రూరంగా అణచి వేస్తున్నాయని, ఈ వైఖరి ప్రజాస్వామ్య రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని వివరించారు. తమ వేదిక హక్కుల రక్షణకు పోరాడుతుందని, ఈ ఉద్యమంలో మేధావులు, విద్యా వంతులు, ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఈ మహాసభలో కరీంనగర్ జిల్లా అధ్యక్షులు సల్ప రమేష్, జిల్లా అధ్యక్షులు గడ్డం గంగులు, ప్రతినిధులు సరిత, అహ్మద్, అరుణ, రేఖ, మీన, సహాని, అరుణ్, నరేందర్, న్యాయవాదులు సంగం, రమేష్, అన్వేష్, శ్రీనివాస్, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

డిసెంబర్ 4న హరిదా మహాసభ

- ప్రముఖ కవి డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డికి సరస్వతీరాజ్ తెలంగాణ విశిష్ట సాహిత్య పురస్కారం ప్రదానం

నవతెలంగాణ-కంఠేశ్వర్

హరిదా రచయితల సంఘం ఆరవ మహా సభను డిసెంబర్ 4వ తేదీ బుధవారం సాయంత్రం 5 గంటలకు నవ్యభారతి గ్లోబల్ స్కూల్ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షులు ఘనపురం దేవేందర్, నవ్య భారతి విద్యాసంస్థల అధినేత కె.సంతోష్ కుమార్ తెలిపారు. మహాసభలో ప్రధాన అంశంగా సరస్వతీరాజ్ హరిదా తెలంగాణ విశిష్ట సాహిత్య పురస్కారాన్ని ప్రఖ్యాత కవి, విమర్శకుడు, డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డికి అందజేయనున్నట్లు వారు తెలిపారు. జిల్లా సాహిత్య రంగంలో కృషి చేస్తున్న వారికి సరస్వతీరాజ్ అవార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. గతంలో ఈ పురస్కారాన్ని ప్రఖ్యాత కవులు డాక్టర్ సామల సదాశివ, ఆచార్య ఎన్.గోపి, డాక్టర్ నందిని సిద్ధారెడ్డి, డాక్టర్ నాళేశ్వరం శంకరం, ఇందూరు అన్నమయ్య వి.నరసింహారెడ్డి అందుకున్నారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామని ఔత్సాహిక


మాట్లాడుతున్న ఘనపురం దేవేందర్

కవులు 29వ తేదీలోగా తమ పేర్లను 8897213286, 8374002227 నెంబర్లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హరిదా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసర్ల నరేశ్ రావు, కోశాధికారి డాక్టర్ గంట్యాల ప్రసాద్, అధికార ప్రతినిధి నరాల సుధాకర్, ఉపాధ్యక్షులు తిరుమల శ్రీనివాస్ ఆర్య, సీనియర్ కవి పంచరెడ్డి లక్ష్మణ, కొయ్యాడ శంకర్, డాక్టర్ మద్దుకూరి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

9వ రాష్ట్ర సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలలో

జిల్లా బాలుర జట్టు విజయం

నవతెలంగాణ-ఆర్మూర్

గత రెండు రోజుల నుంచి మెదక్ జిల్లా మాసాయిపేట్‌లో జరిగిన 9వ రాష్ట్ర సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలలో జిల్లా బాలుర జట్టు ఫైనల్ మ్యాచ్‌లో మెదక్ జట్టుపై తలపడి 07-01 పరుగుల తేడాతో విజయం సాధించినట్టు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు వి.ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మార్కంటి గంగామోహన్ ఆదివారం తెలిపారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెదక్ జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ రాధాకృష్ణన్ రావు చేతుల మీదుగా ట్రోఫీ, బంగారు పతకాలు అందుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఉత్తమ పిక్చర్ రోహిత్ ప్రత్యేక బహుమతిని రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె నవీన్ కుమార్, ఉపాధ్యక్షులు కే శోభన్ బాబు, అభిషేక్ గౌడ్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి బొజ్జ మల్లేష్ గౌడ్, జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సొప్పరి వినోద్, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్లు పి.నీరజారెడ్డి, సంగీతరావు, పవన్ కుమార్, రాజ్ కుమార్, రాజేందర్, టి.సునీత, మర్కంటి సుజాత, చిప్ప నవీన్, సురేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ జిల్లా జట్టుకు కోచ్ మేనేజర్లుగా ఈ.నరేష్, సాయికుమార్, తిరుపతి వ్యవహరించారు.

అభ్యాసలో చెన్నా శ్రీనివాస్ మెమోరియల్ టోర్నమెంట్ వేడుకలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నగరంలోని అభ్యాస ద స్కూల్లో స్కూల్ కరస్పాండెంట్ చిన్న శ్రీనివాస్ జ్ఞాపకార్థం చెన్నా శ్రీనివాస్ మెమోరియల్ టోర్నమెంట్‌ను ఆదివారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని రాజారాం స్టేడియంలో నెట్‌బాల్ పోటీల్లో జిల్లాలోని 16 పాఠశాలలు పాల్గొన్నాయి. అదేవిధంగా అభ్యాసలో చెస్, క్యారం, టేబుల్ టెన్నిస్, స్కిప్పింగ్, డాడ్జ్‌బాల్, రన్నింగ్ రేస్, ఎలిఫెంట్ వాక్, ఫ్రాగ్ జంప్, మ్యూజికల్ చైర్, కోకో పోటీలు నిర్వహించి ఆదివారం బహుమతులు అందజేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఎస్జీఎఫ్ సెక్రటరీ ఎం.నాగమణి, జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి.వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ అభ్యాస యాజమాన్యం క్రీడలకు ఇస్తున్న ప్రాధాన్యతను ప్రశంసిస్తూ ఈ ప్రోత్సాహాన్ని ఇలాగే అందించాలని కోరారు. అదేవిధంగా జి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అభ్యాస యాజమాన్యం ప్రైవేటు ప్రభుత్వ పాఠశాలలకు ప్రాధాన్యత ఇస్తూ నిర్వహించిన పోటీలకు కృతజ్ఞత తెలియజేశారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ చిన్న అన్నపూర్ణ



బహుమతిని అందజేస్తున్న పలువురు

మాట్లాడుతూ చెన్న శ్రీనివాస్ రోలింగ్ షీల్డ్‌ను ప్రకటిస్తూ చదువులతో పాటు క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ అభ్యాస స్కూల్ విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దే ప్రయత్నం కొనసాగిస్తామని, అదేవిధంగా పిఈటి నాగరాజును కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అభ్యాస యాజమాన్యం డైరెక్టర్లు శ్రీనివాస్, శ్రీకాంత్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వ్యవసాయ కమిషన్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఏఈఓలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల నియమించబడిన తెలంగాణా రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు గడుగ గంగాధర్‌ను తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విస్తరణ అధికారుల ఐక్య వేదిక అధ్యక్షులు రాజ్ కుమార్ బాదావత్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల ఏఈఓలతో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ శాఖలో నూతనోత్తేజాన్ని నింపే దిశగా, గ్రామీణ స్థాయిలో వ్యవసాయ విస్తరణను పటిష్ఠం చేసే ఉద్దేశ్యంతో ఆదర్శ రైతు వ్యవస్థ పునరుద్ధరణతో పాటుగా, ఆత్మ కమిటీల నియామకం గురించి ప్రభుత్వానికి నివేదించి వ్యవసాయ శాఖ బలోపేతం కొరకు కృషి చేస్తున్న తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కమిషన్‌కు ఈ సందర్భంగా ఏఈఓ లు


గంగాధర్‌ను సన్మానిస్తున్న ఏఈఓలు

కృతజ్ఞతలు తెలిపారు. ఆదర్శ రైతులు వ్యవసాయ శాఖతో మమేకమై కలిసి పని చేసే విధంగా వారికి జాబ్ చార్ట్, కనీస విద్యార్హతలు, కనీస గౌరవ భృతి ఉండే విధంగా కృషి చేయవలసిందిగా వ్యవసాయ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్‌ను ఏఈఓలు కోరారు. ఈ సందర్భంగా కమిషన్‌కు గడుగు గంగాధర్ అందిస్తున్న విలువైన సేవలను కొనియాడుతూ ఏఈఓలు శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు రాజు నాయక్, నృపేష్, జ్ఞానేశ్వర్, చక్రపాణి, శరత్, సంధ్యరేఖ, కృష్ణరెడ్డి, రాజా తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అయ్యప్ప మాలధారులకు నిత్యాన్నదానం

నవతెలంగాణ-ఆర్మూర్

అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి, అయ్యప్ప సేవ సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారణ స్వాములకు నేటి నుంచి జనవరి 5 వరకు 41 రోజులు అన్నప్రసాద (బిక్ష) వితరణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు అయ్యప్ప సేవా సమితి అధ్యక్షులు పెంట జలంధర్ స్వామి ఆదివారం తెలిపారు. ప్రతి రోజు ఉదయం 12.30 గంటల నుంచి 3 గంటల వరకు నిర్వహించబడునని, గత 17 సంవత్సరాలుగా ఈ అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వివరించారు. మాలధారణ స్వాములందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని గురుస్వామి నిర్మల నాగేష్ శర్మ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి ప్రతినిధులు ఇరుపాజీ జనార్ధన్ గౌడ్, గౌరవ అధ్యక్షులు మీసాల రాజేశ్వర్, ధనపల్ శివ, చేపూర్ ధనంజయ్, మీసాల మహేష్, గుడి గోపి, సురేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మాల సింహ గర్జన సభ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాల సంఘం సభ్యులు

నవతెలంగాణ-వర్ని(చందూర్)

మండలంలోని ఘన్‌పూర్, చందూర్ గ్రామాల మాల మహానాడు సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం చలో మాల, హైదరాబాద్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుల వర్గీకరణతో మాల జాతికి అన్యాయం చేస్తున్నాయని, కుల వర్గీకరణకు వ్యతిరేకంగా డిసెంబర్ 1న హైదరాబాద్‌లో జరిగే మాల సింహ గర్జన సభకు తరలుతున్నట్టు సంఘం నాయకులు తెలిపారు. మహిళా, పురషులు అధిక సంఖ్యలో హాజరై విజవయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు సంఘం నాయకులు ఇందూర్ సాయిలు, టి.సాయిలు, గంగాధర్, గైని సాయిలు, నీరడి సాయిలు, నరహరి, టి.గంగారాం, చందూర్ నాయకులు, టీచర్ ఎం.సాయిలు, బి.సాయిలు, మహేందర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు నిరసన ర్యాలీని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఎఐటీయుసి నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక రైతాంగ వ్యవసాయ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 26న రాజీవ్ గాంధీ ఆడిటోరియం నుంచి ధర్నా చౌక్ వరకు నిరసన ర్యాలీని నిర్వహించనున్నట్టు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బడా పెట్టుబడిదారులకు ఆర్థికపరమైన మినహాయింపులను ఈ దేశంలో అసంఘటిత రంగంలో పనిచేస్తున్న 47 కోట్ల మంది కార్మికులకు ఇలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయకుండా పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దుచేసి కార్మికులకు హక్కులు లేకుండా చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు పి.నర్సింగరావు, కార్యదర్శి అనిల్, నాయకులు కండ్లకోయ గంగాధర్, రాధాకుమార్, సఖి సురేష్, అలీ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శ్రమదానం

నవతెలంగాణ-భిక్కనూరు



మండలంలోని బిటిఎస్ వద్ద ఉన్న సౌత్ క్యాంపస్ లో ఆదివారం ఎన్ ఎస్ ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో డిపార్ట్మెంట్ ఆఫ్ సోషల్ వర్క్ శ్రమదానంలో భాగంగా వాలంటరీ క్లీన్ అండ్ గ్రీన్ నిర్వహించి చెట్లకు నీళ్ల పోసి క్యాంపస్ పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు . ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అంజయ్య మాట్లాడుతూ చదువుతో పాటు సమాజ సేవ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ 5 యూనిట్ వాలంటరీస్ పాల్గొన్నారు.

నీహారిక పాటను విడుదల చేసిన కామారెడ్డి కవులు

నవతెలంగాణ-కామారెడ్డి



ప్రముఖ కవి, రచయిత గఫూర్ శిక్షక్ రాసి పాడి రూపొందించిన నీహారిక వీడియో పాటను కామారెడ్డిలోని సీనియర్ సిటిజన్స్ ఫోరంలో ప్రముఖ గజల్ కవి సూరారం శంకర్ ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నీహారిక పాటను అద్భుతమైన గానంతో, మంచి సాహిత్యంతో రూపొందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కవులు అల్లి మోహన్ రాజ్, తిరుపతిరావు , ప్రభాకర్, సంగా గౌడ్, బాలకృష్ణ , పాట దర్శకుడు కొడి రవీందర్ , నటీనటులు శివ , ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి/నిజాంసాగర్/మద్నూర్

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో 247, 251 పోలింగ్ బూత్‌లలో ఏర్పాటుచేసిన బూతు స్థాయి ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కేంద్రాలను ఆదివారం ఎల్లారెడ్డి తహసిల్దార్ మహేందర్ తనిఖీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తెలిపారు. ముందుగా నమోదు చేసుకున్న ఓటర్ల వివరాలు సక్రమంగా లేకుంటే మార్పులు చేర్పులు చేసుకోవడానికి బూతుల వారిగా ఏర్పాటుచేసిన ఈ ప్రత్యేక కేంద్రాలలో సవరణ చేసుకోవచ్చని సూచించారు. అనంతరం గండి మాంసంపేట్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. తూకం అయిన ధాన్యం బస్తాలను ఎప్పటికప్పుడు తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఆర్ఐ శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

నిజాంసాగర్ : మండలంలోని నర్సింగ్‌రావుపల్లి, వడ్డేపల్లి, మాగి గ్రామాలలో ఓటర్ నమోదు కార్యక్రమాన్ని మండల రెవెన్యూ అధికారి బిక్షపతి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..





ఎల్లారెడ్డి: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కేంద్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్.. నిజాంసాగర్‌లో..

1-1-2025 నాటికి 18 సంవత్సరాలు నిండుతున్న వారికి రెండు రోజుల స్పెషల్ సమ్మరీ క్యాంపెరిగ్‌లో భాగంగా ఓటర్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.

మండలంలోని అందరు బి ఎల్ ఓ, బూత్ లెవెల్ అధికారులు తమ తమ పోలింగ్ కేంద్రాలలో హాజరై కొత్త ఓటు హక్కు దరఖాస్తులను స్వీకరిస్తున్నారని తెలపారు. ఎవరైతే 18 సంవత్సరాలు నిండాయో వారు కొత్త ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కొత్త ఓటు హక్కు కోసం ఆన్లైన్ లో ఫారం-6 న్యూ ఎంట్రీ తో దరఖాస్తు చేసుకోవాలని, ఓటు లో మార్పులు సవరణల కోసం ఫారం-8 ని ఉపయోగించి చేసుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామల బిఎల్వోలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా ఓటర్‌గా నమోదు చేసుకోండి

మద్నూర్ : సాధారణ ఓటర్‌గా నమోదు కు ఈ నెల 28వ తేదీ తుది గడువు ఉందని ఈ అవకాశాన్ని జనవరి 1వ తేదీకి 18 సం.. వయస్సు లోకి వచ్చే ప్రతి ఒక్కరు వినియోగించు కోవాలని మద్నూర్ మండల తహసీల్దార్ ఎం డి ముజీబ్ సూచించారు. శని, ఆదివారాల్లో ఎన్నికల కమిషన్ ఇచ్చిన ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమం లో భాగంగా ఆదివారం తడి హిప్పర్గ, సోనాల, మద్నూర్ గ్రామాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ నమోదు క్యాంపెయిన్ ను ఆయన పరిశీలించారు.

నేడు ప్రజావాణి.. వినియోగించుకోవాలి

నవతెలంగాణ-తాడ్వాయి

తహసీల్ కార్యాలయంలో నేడు (సోమవారం) జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని తహసి ల్దార్ రహీముద్దీన్ ఆదవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుండి రెండు గంటల వరకు ప్రజా వాణి నిర్వహించనున్నట్టు తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదులు చేసుకోవచ్చని తెలిపారు.

కొనసాగుతున్న ఉత్సవాలు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రంలోని జంగం గల్లీలో గల వీర భద్ర స్వామి ఆల యంలో వార్షికోత్సవాలు కొన సాగుతున్నాయి. ఆదివా రం శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి కళ్యాణం నిర్వహిం చారు. సోమవారం ఆలయం ఆవరణంలో ఉదయం ఏడు న్నర గంటలకు అగ్నిగుండం దక్ష యజ్ఞం కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆలయ పూజారులు సంఘయప్ప శివప్ప తెలిపారు.

శ్రీ కాలబైరవ స్వామి సన్నిధిలో జన జాతర



రథం ఊరేగింపు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఇసన్నపల్లి (రామారెడ్డి) లో వెలసిన శ్రీ కాలభైరవ స్వామి జన్మదిన వేడుకలు చివరి రోజు ఆదివారం పలు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఇసన్నపల్లి, రామారెడ్డి గ్రామ ప్రధాన వీధుల కూడా రథోత్సవంలో స్వామివారిని ఊరేగింపు నిర్వహించారు. రతోత్సవంలో జనాలతో జాతర కనువిందు చేసింది. ఆలయ ప్రాంగణంలో భక్తులు దక్షయజ్ఞము (అగ్ని గుండములు) నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు చేపట్టారు. స్వామివారు ఉత్సవాలు ప్రశాంతంగా ముగించాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభు, అగ్నిగుండ నిర్వాహకులు మహంత్ కైలాస్, ప్రభాకర్ స్వామి, దిలీప్, కుమారస్వామి, శ్రీశైలం, ఇరు గ్రామాల ప్రజలు, ఆయా జిల్లాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

ఇంటివద్దకే సీఆర్ఎఫ్ చెక్కులు

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని మేడిపల్లి గ్రామంలో ఆదివారం సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ కాంగ్రెస్ నాయకులు చేశారు. ఈ సందర్భంగా మేడిపల్లి గ్రామంలో గాంధారి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారి పరమేష్ మాట్లాడుతూ రూపాయి ఖర్చు లేకుండా ఇంటి వద్దకే తీసుకెళ్లి చెక్కులు అందజేస్తున్నట్టు తెలిపారు. నిరుపేద కుటుంబాలకు ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అండగా నిలుస్తున్నారని అన్నారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు అక్బర్‌తో కలిసి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పిట్ల తిరుపతి, ఎండీ మైబూబ్, ఎండీ మైనొద్దీన్, బాబు, పిట్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఆదివారం సాయంత్రం పలు వాహనాలను తనిఖీ చేసినట్టు ఏఎస్ఐ ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. అతివేగంతో వాహనాన్ని నడపరాదని ఆయన సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపినట్లయితే చర్యలు తీసుకుంటామన్నారు. అతివేగం ప్రమాదకరమన్నారు. వాహనాల ధ్రువపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని, బీమా సౌకర్యం కల్పించుకోవాలని సూచించారు. నిబంధనలు పాటించని పలువురు వాహనదారులకు జరిమానా విధించారు.

పోలీస్ శిక్షణ పూర్తి చేసుకున్న యువతికి సన్మానం




యువతిని సన్మానించిన నాయకులు, గ్రామస్తులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండల పరిధిలోని కట్టకింది తండా గ్రామానికి చెందిన రేఖ నాయక్ ఇటీవల పోలీసు ఉద్యోగం సాధించి విజయవంతంగా శిక్షణను పూర్తి చేసుకుని స్వగ్రామానికి వచ్చిన సందర్భంగా ఆదివారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి మండలాధ్యక్షులు కురుమ సాయిబాబా.. గ్రామస్తులతో కలిసి ఆమెను శాలువాతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించి అవార్డులు పొందుతూ ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం అడవి లింగాల గ్రామానికి చెందిన సాయిలు కూతురు వివాహ వేడుకలకు హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి సన్మానం



సన్మానించిన పలువురు

నవతెలంగాణ-గాంధారి

పిఆర్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన పి దామోదర్‌రెడ్డిని.. కామారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్ట శ్రీనివాస్ రెడ్డిని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డిసిసిబి, డీసీఎంఎస్ డైరెక్టర్ సాయికుమార్ ఆదివారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు అసోసియేట్ అధ్యక్షులు జూకంటి బాపురెడ్డి , స్టేట్ వైస్ ప్రెసిడెంట్ విక్రమ్, పాల్వంచ మండల అధ్యక్షులు తోట బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పనుల్లో పారదర్శకతకే స.హ చట్టం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



మాట్లాడుతున్న జిల్లా సలహాదారులు లింగమయ్య

సమాచార హక్కు చట్టం బ్రహ్మాస్త్రం లాంటిదని, ప్రభుత్వ కార్యకలాపాలలో జవాబుదారితనం, పారదర్శకత కోసం సమాచార హక్కు(స.హ) చట్టం తీసుకొచ్చినట్టు ఆర్టిఐ కామారెడ్డి జిల్లా సలహాదారు లింగమయ్య తెలిపారు. కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహంలో హాస్టల్ వార్డెన్ విజయశాంతి సమక్షంలో ఆదివారం సమాచార హక్కు చట్టం-2005 పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరులు ఏదైనా సమాచారం తెలుసుకోవాలంటే సమాచార హక్కు చట్టం ప్రకారం అర్జీ పెట్టుకొని పూర్తి సమాచారాన్ని తెలుసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో సహా చట్టం ఎల్లారెడ్డి పట్టణ అధ్యక్షులు సాయికుమార్, హాస్టల్ విద్యార్థులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయులకు 010 ద్వారా వేతనాలు ఇవ్వాలి

నవతెలంగాణ-సదాశివనగర్




మాట్లాడుతున్న పలువురు

మోడల్ స్కూల్‌లను స్కూల్ ఎడ్యుకేషన్‌లో కలిపి 010 ద్వారా వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని సీపీఎస్ మ్యాచింగ్ గ్రాంట్ ఇప్పించాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. ఆదివారం మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ పిఆర్టియు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డిని కామారెడ్డిలో కలసి విన్నవించారు. ఔట్సోర్సింగ్, ఒకేషనల్ టీచర్ల వేతనాలు ఇప్పించాలని కోరారు. దీనికి హర్షవర్ధన్ రెడ్డి స్పందిస్తూ 010 ద్వారా మోడల్ స్కూల్స్ టీచర్స్ వేతనాలు తీసుకొనే సమయం దగ్గర్లోనే ఉందని అన్నారు. ఔట్సోర్సింగ్, ఒకేషనల్ టీచర్స్ వేతనాలు ఇప్పించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. అన్ని సమస్యలు పరిష్కారం చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ట్రాన్స్‌ఫర్‌కు కృషి చేసినందుకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ప్రతినిధులు రాజశేఖర్, సాయిబాబా, నరసింహ చారి, విద్యారమణ టీచర్లు పాల్గొన్నారు.

వారం రోజుల నుండి తాగు నీటి కష్టాలు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్



పెద్దకొడప్ గల్ మండలంలోని చవునితండాలోని ఓ గల్లికి వారం రోజుల నుండి నీటి కష్టాలు అధికం కావడంతో కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు. ఎవరికీ చెప్పుకోవాలో తెలియడం లేదని వాపోతున్నారు. ఈ తాండ వాసులకు రెండు బోర్ మోటారు మిషన్ భగీరథ నీళ్లు ఉన్నా కానీ ఒక కాలనిలో మాత్రం నీటి కష్టాలు అంతా ఇంతా కాదని చెప్పవచ్చు. ఉదయం ఇంటింటికి సరఫరా వచ్చే కుళాయిలో మాత్రం కొన్ని ఇండ్లు రెండు మూడు బిందెలు నీళ్ల మాత్రమే వస్తున్నాయి. మరికొన్ని ఇండ్లకు మాత్రం అసలే నీళ్లు సరఫరా కాకపోవడంతో నీళ్ల సమస్యను పరిష్కరించే వారు ఎవరు లేరని ఆవేదన చెందుతున్నారు. మిషన్ భగీరథ నీళ్ల తండాకు వస్తున్నా అవి ఎక్కడ కూడా ఉపయోగం లేదని చెప్పవచ్చు. భగీరథ నీళ్ల వస్తున్న అవి వృదాగానే పోతుందని జనాలు అంటున్నారు. తలబ్ తాండ శివపూర్ మధ్యలో ఉన్న బోర్ మోటార్ పైప్ లైన్ చెడిపోయి వారం రోజుల అవుతున్నా దానికి మరమ్మతు చేయించేవారు లేరని జనాలు అంటున్నారు. ఏదిఏమైన కాలనీ వాసులకు నీళ్ల అందించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను కోరుతున్నారు.

100 శాతం సర్వే పూర్తి

నవతెలంగాణ-లింగంపేట్



సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

లింగంపేట్ మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో ఆదివారం నాటికి 100 శాతం సర్వే పూర్తయిందని ఎంపీడీవో నరేష్ వెల్లడించారు. మండలంలోని 41 గ్రామ పంచాయతీల పరిధిలో ఆదివారం నాటికి 14 వేల ఎనిమిది వందల కుటుంబాలకు సంబంధించినటువంటి సమగ్ర కుల గణన కుటుంబ సర్వే చేపట్టినట్టు తెలిపారు. గ్రామ పంచాయతీల వారీగా వార్డుల క్లస్టర్ల వారిగా ఎన్యూమరేటర్లకు సర్వేకు సంబంధించినటువంటి జాబితాను అందజేసినట్టు తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశానుసారం సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్టు తెలిపారు. తప్పుడు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆపరేటర్లకు గ్రామపంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఆయన వెంట ఎంపీ ఓ మలహరి గ్రామపంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఆలయ కోడె దూడలకు వరిగడ్డి వితరణ

నవతెలంగాణ-భిక్కనూరు

మండల కేంద్ర శివాలోని దక్షిణ కాశి సిద్ధ రామేశ్వర ఆలయంలో ఉన్న కోడెలకు ఆహారంగా వరిగడ్డిని రాజు ఆదివారం వితరణ చేశారు. ఆలయంలో ఉన్న కోడెదూడలకు రైతులు వరిగడ్డిని కాల్చకుండా ఆలయంలోని కోడెదూడలకు వితరణ చేయాలని పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీధర్ సిబ్బంది ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్‌గా నమోదుకు మరోసారి అవకాశం

నవతెలంగాణ-మద్నూర్

ఎమ్మెల్సీ టీచర్స్, గ్రాడ్యుయేట్ ఎన్నికలకు ఓటర్ గా నమోదు కు మరో సారి అవకాశం ఇచ్చినట్లు తహసిల్దార్ వెల్లడించారు. నేటి నుండి డిసెంబర్ 9వ తేదీ వరకు తుది గడువు ఉందని తెలిపారు. ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమం ను గిర్దవార్ శంకర్, సూపర్ వైజర్ రవి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ వెళ్లిన నాయకులు

నవతెలంగాణ-తాడ్వాయి

ఈనెల 26న ఢిల్లీలో జరిగే భారత రాజ్యాంగం పరిరక్షణ సమావేశానికి ఆదివారం తరలి వెళ్ళినట్లు కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షు లు గైన శివాజీ తెలిపారు. ఈ సమావేశం ఢిల్లీలోని తల్ కటోర స్టేడియంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగర్తి ప్రీతం అధ్యక్షతన నిర్వహంచనున్నట్టు తెలిపారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు వెళ్లినట్లు తెలిపారు. బాగయ్య ఆయా గ్రామాల నాయకులు వెళ్లిన వారిలో ఉన్నారు

సిద్ధిరామేశ్వర ఆలయంలో సామూహిక అభిషేకాలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న పలువురు

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్ర శివారులో ఉన్న దక్షిణ కాశిగా పిలవబడే శ్రీ సిద్ధి రామేశ్వర ఆలయంలో కార్తీకమాస ఆదివారం సందర్భంగా సామూహిక అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మండల కేంద్రం నుండే కాకుండా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు అభిషేకాలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు చేపట్టినట్లు ఆలయ కార్యాలయ నిర్వహణ అధికారి శ్రీధర్ తెలిపారు.

మద్నూర్ మార్కెట్ కమిటీ పాలకవర్గం ఖరారు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ఎన్నికయింది. చైర్మన్గా సౌజన్య రమేష్, వైస్ చైర్మన్‌గా పరమేష్ పటేల్ నియమితులయ్యారు. వీరితోపాటు ఎంపికైన డైరెక్టర్ల వివరాలు ఇలా ఉన్నాయి. కొంచెంవార్ అనిల్ కుమార్, శెట్టి వార్ రామ్ గొండ, చౌళవార్ శంకర్ జాదవ్ హరి, పడంపల్లె హనుమంత్, మహమ్మద్ అహ్మద్, మలి పటేల్ రామ్ చంద్రరావు, వనంజే మాయావతి, జాదవ్ హనుమంత్, షేక్ ఇబ్రహీం, ఐన్ల విటల్, అశోక్, మద్నూర్ పిఎసిఎస్ చైర్మన్ అశోక్ పటేల్, మద్నూర్ మేజర్ గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి రాణి, కామారెడ్డి జిల్లా డిఎంఓ, అగ్రికల్చర్ బిచ్కుంద ఏడి ఏ, ఈ విధంగా నూతన పాలకవర్గం ఎంపిక చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు మద్నూర్ మార్కెట్ కమిటీ అధికారులు తెలిపారు.

ప్రారంభమైన భీమన్న ఉత్సవాలు


పూజలు చేస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-ముప్కాల్
ముప్కాల్ ఆదివాసీ నాయకపోడు సేవా సంఘం (2వ పంథా) ఆధ్వర్యంలో భీమన్న ఉత్సవాలు ఆదివారం ఉదయం ప్రారంభమైనట్లు సంఘం పెద్దలు తెలిపారు. సోమవారం భీమన్న గదాల ఊరేగింపు, 26 మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు కంచు గంగాధర్, ఎర్రోళ్ల విజయ్, కంచు ముత్యం, కంచు సతీష్, శ్రవణ్, కార్తిక్, జువ్వన్న, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే వెలుగులు



నవతెలంగాణ-మోర్తాడ్
మోర్తాడ్ బస్టాండ్ ప్రాంతంలో 63వ రహదారి సమీపంలో వీధిదీపాలు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు సైతం వీధి దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. తెల్లవారుజామున వీధిదీపాలను ఆర్పాల్సిన సిబ్బంది ఎవరూ ఆర్పకపోవడంతో నిరంతరం వీధి దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. అధికారులు వీటిపై దృష్టి సారించి వీధిదీపాలను ఆర్పివేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు ఖాజాపూర్‌కు ఎమ్మెల్యే రాక

నవతెలంగాణ-బోధన్
సాలూర మండలంలోని ఖాజాపూర్ గ్రామంలో మహాత్మ బసవేశ్వర విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఉదయం 10 గంటలకు హాజరుకానున్నట్లు ఆయన వ్యక్తిగత సహాయకులు మైపాల్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం 11 గంటలకు బోధన్ మండలం పెగడాపల్లి గ్రామంలో మహాలక్ష్మీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొంటారని, మధ్యాహ్నం 12 గంటలకు బర్దిపూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం నూతన భవన శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. తరువాత 1 గంటలకు రాజీవ్‌నగర్ తాండ గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారని ఆయన తెలిపారు.

దుబాయ్‌లో సుద్దపల్లి వాసి మృతి


మేకల హరీష్ (ఫైల్)

నవతెలంగాణ-డిచ్‌పల్లి
మండలంలోని సుద్దపల్లి గ్రామానికి చెందిన మేకల హరీష్ బతుకు దెరువు కోసం దుబాయ్‌కు వెళ్లాడు. శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో డ్యూటీ ముగించుకొని ఛాతి నొప్పి వస్తుందని రూమ్‌లో ఉన్న తోటి స్నేహితులతో పేర్కొనడంతో వారు హుటాహుటినా ఆసుపత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యలో గుండెనొప్పి రావడంతో మృతి చెందాడు. దుబాయ్‌లోని స్నేహితులు గ్రామస్తులకు సమాచారం అందించారు. మృతునికి భార్య రాజమణి, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించేలా ప్రభుత్వం చొరవ చూపాలని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు


అనాథ శవానికి అంత్యక్రియలు చేస్తున్న ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ

నవతెలంగాణ-కంఠేశ్వర్
అనాథ శవానికి ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం అంత్యక్రియలను నిర్వహించారు. కుళ్లిపోయి గుర్తుపట్టలేని విధంగా ఉన్న అనాథ శవానికి ఆదివారం ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఇప్పటివరకు 120 అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహించినట్టు ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సాయిబాబు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- నాలుగు తులాల బంగారం, రూ.80 వేల నగదు అపహరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్
నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆరవ పోలీస్ స్టేషన్ పరిధిలో తాళం వేసిన ఓ ఇంట్లో భారీగా చోరి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని వెంగళరావు కాలనీకి చెందిన మహమ్మద్ గౌస్ గురువారం అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లేసరికి బీరువా తెరిచి ఉంది. అందులోనుంచి 4 తులాల బంగారం, రూ.80,000 నగదును గుర్తుతెలియని దుండగులు అపహరించుకుపోయినట్టు బాధితుడు తెలిపాడు.


టీయూలో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలి

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర యూనివర్సిటీల ఇంచార్జ్ రెహమాన్


మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి
తెలంగాణ యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించి, టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీల ఇంచార్జ్ రెహమాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ యూనివర్సిటీలో ఆదివారం ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెహమాన్ మాట్లాడుతూ విద్యారంగాన్ని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయాలని, యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని కాపాడాలని, యూనివర్సిటీల అభివృద్ధి కోసం అధిక నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా అడ్మిషన్ పొందిన ప్రతి విద్యార్థికి ఉచితంగా మెస్, హాస్టల్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ తెలంగాణ యూనివర్సిటీ కన్వీనర్‌గా సాయి, కోకన్వీనర్‌లుగా సంజయ్, చందును ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి సభ్యులు నవీన్ కృష్ణ, యూనివర్సిటీ నాయకులు అజయ్, గౌతమ్, సాయితో పాటు తదితరులు పాల్గొన్నారు.

మారుతి జోషి వర్ధంతి సంస్మరణ సభ


నివాళులర్పిస్తున్న పలువురు

నవతెలంగాణ-బాల్కొండ
మారుతి జోషి 5వ వర్ధంతి సందర్భంగా ఆదివారం సంస్మరణ సభ మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సిహెచ్ కిషన్, ఆలయ కమిటీ సభ్యులు తౌట్ గంగాధర్, బలరాం సింగ్, యమగంటి లింగాగౌడ్, మెడికల్ నరేందర్, నాగుల రాజేందర్ గౌడ్, అంబటి నవీన్, గాండ్ల రాజేష్, యం.ఎస్ గౌడ్, అయ్యప్ప భక్తులు తదితరులు పాల్గొన్నారు.

లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ..
సంక్షేమ ఫలాలను అందిస్తున్నాం

- మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-రెంజల్
గత ప్రభుత్వం చేసిన అప్పులతో 8 లక్షల కోట్ల లోటు బడ్జెట్‌తో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని.. అయినా తాము సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం మండలంలోని వీరన్నగుట్ట తండా, బోర్గాం, మౌలాలితాండ గ్రామాలలో నూతన గ్రామపంచాయతీ భవనాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.20 లక్షల వ్యయంతో చేపడుతున్న ఈ భవనాలను నాణ్యత లోపం లేకుండా గ్రామస్తులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఎస్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి భవనాలకు కేటాయించినట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ప్రజా క్షేమం కోసం ముందుకు సాగుతామని ఆయన పిలుపునిచ్చారు. రైతులు పండించిన పంటకు క్వింటాకు రూ.500 చొప్పున ఇవ్వడంతో రైతుల్లో ఆనందాన్ని చూస్తున్నామని ఆయన అన్నారు. షుగర్ ఫ్యాక్టరీపై రూ.200 కోట్ల నష్టం వాటిల్లిందని, అయినా షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రైతులు చెరుకు పంట సాగుకు ఆసక్తి కనబరచాలని ఆయన ఈ సందర్భంగా రైతులను కోరారు. త్వరలోనే ఉపాధి హామీ కూలీలకు జీవనభృతి కల్పించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన చెప్పారు. కలుషితమైన పాలను తీసుకోకుండా విజయ డెయిరీ పాలనే కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. రైతులు విజయ డెయిరీకి పాలను విక్రయిస్తే 15 రోజుల్లోపే వారికి డబ్బులు వచ్చేలా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. నేటి సమాజంలో కలుషితమైన వస్తువులు సరఫరా చేస్తున్నారని ప్రజలు నాణ్యత గల వస్తువులను మాత్రమే తీసుకోవాలన్నారు. కందకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా బోర్గం గ్రామం వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోబీన్ ఖాన్, సాయిరెడ్డి, జావీద్, ధనుంజయ్, సురేందర్ గౌడ్, చౌకత్, గణేష్ నాయక్, బన్సియ నాయక్, రెంజల్ సింగిల్‌విండో చైర్మన్ మొయినోద్దీన్, ఎమ్మెల్ రాజు, మోహన్, కార్తీక్ యాదవ్, సిద్ధ సాయిలు, బాబునాయక్ తదితరులు పాల్గొన్నారు.

షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ..
మండల కేంద్రంలోని రైతు వేదికలో మాజీమంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి షాది ముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలను ఆదుకోవాలన్న తలంపుతో తమ ప్రభుత్వం లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ వారికి ఆర్థికంగా ఆదుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. మండలంలో 59 మందికి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన చేతుల మీదుగా అందజేశారు.

పంచాయతీ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి

- జీవో 51ని రద్దుచేసి ప్రతిపంచాయతీ కార్మికుడిని పర్మినెంట్ చేయాలి
- ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా కార్యదర్శి ఆర్.రమేష్


మాట్లాడుతున్న టీయూసీఐ నాయకులు

నవతెలంగాణ-ధర్పల్లి
జీవో 51ను రద్దుచేసి పంచాయతీ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని, పెండింగ్‌లో ఉన్న కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా కార్యదర్శి ఆర్.రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (టియుసిఐ) మండల కమిటీ ఆధ్వర్యంలో అధ్యక్షులు ఆశన్న అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.రమేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం గ్రామపంచాయతీ వర్కర్స్‌కు నెలల తరబడి పెండింగ్‌లో వేతనాలు పెట్టి వెట్టిచాకిరీ చేయించుకుంటుందన్నారు. వెంటనే నిధులు మంజూరు చేయాలని, జీవో 60 ప్రకారం వేతనాలు పెంచాలని, అందరినీ పర్మినెంట్ చేయాలని అన్నారు. జీవో 51ను రద్దు చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న సుమారు 60 వేల మంది స్వీపర్లు, వాటర్‌మెన్స్, కారోబార్లు, డ్రైవర్స్, ఎలక్ట్రిషన్స్, బిల్ కలెక్టర్లు, అందరికీ మెజార్టీ గ్రామాలలో రెండు నుంచి ఐదు నెలల వరకు కొత్తగా ఏర్పడ్డ గ్రామపంచాయతీలో ఐదు నెలలు, సంవత్సరం వరకు కూడా జీతాలు పెండింగ్లో ఉన్నాయన్నారు. జీవో 51తో చదువు వచ్చినవాళ్ళు, చదువు రానివారు మల్టీపర్పస్ పేరుతో అందరూ అన్ని పనులు చేయాలనే తప్పుడు విధానాన్ని గత ప్రభుత్వం తెచ్చిందన్నారు. జీవో 51ను రద్దు చేసి వివిధ కేటగిరీలుగా పని విభజన చేసి జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. అవసరాలకు తగ్గట్టుగా కార్మికుల సంఖ్య పెంచాలని, కార్మికులపై పనిఒత్తిడి తగ్గించాలని, అధికారుల వేధింపులు బెదిరింపులు ఆపాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సాయిలు, వీలాష్, గంగన్న, అనంతయ్య, రాజన్న, గంగారాం, సులోచన, సాయవ్వ, సునీత, రాజవ్వ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సిద్దుల గుట్టను దర్శించుకున్న హిమాలయ యోగి


సిద్దుల గుట్టను సందర్శించిన యోగి

నవతెలంగాణ-ఆర్మూర్
రుద్ర ప్రయాగ్ నుంచి 109 సంవత్సరాల హిమాలయ యోగి సంత్ సదానందగిరి స్వామి మహారాజ్ ఆదివారం పట్టణంలోని సిద్దుల గుట్టను సందర్శించారు. సిద్దుల గుట్ట విశిష్టతను పిఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షుడు సాయికృష్ణారెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన నాయకులు


ఎమ్మెల్సీని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-బోధన్
స్థానిక సంస్థల నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎన్నికై నేటికి 3 సంవత్సరాలు పూర్తి కావడంతో బోధన్ పట్టణ బీఆర్ఎస్ నాయకులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఎమ్మెల్సీ కవితను కలిసిన వారిలో పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్, రజాక్, తోకల గంగారెడ్డి, నక్క లింగన్న, అశోక్‌రెడ్డి, విద్యాసాగర్, రవిశంకర్ గౌడ్, శ్రీనివాస్, సంజీవ్ పటేల్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల్లో వ్యతిరేకత, అసహనాన్ని గుర్తించాం

- అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్
- క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాల సందర్శన


మాట్లాడుతున్న అఖిల భారత ప్రగతి శీల రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
రైతుల్లో వ్యతిరేకత, అసహనాన్ని గుర్తించామని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్ తెలిపారు. మండలంలోని ఉప్లూర్, హాసకొత్తూర్, కమ్మర్‌పల్లి, బషీరాబాద్, చౌట్‌పల్లి గ్రామాల్లో కొనసాగుతున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ తీరును, వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం, సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా ప్రతినిధి బృందం సభ్యులు ఆదివారం క్షేత్రస్థాయి సందర్శన చేశారు. రైతులను కలిసి వాస్తవ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్, కార్యదర్శి బి.దేవారం, జిల్లా అధ్యక్షులు సారా సురేష్ మాట్లాడారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆరు గ్యారెంటీల ప్రజా సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేసిందన్నారు. అందులో భాగంగానే వ్యవసాయ రంగానికి 11 రకాల పంటలకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తానని, రైతు భరోసా రెండు పంటల గాను ఎకరా రూ.15 వేలు, రెండు లక్షల రుణాలు ఉన్న ప్రతి రైతుకు రద్దు చేస్తానని, వ్యవసాయ పనిముట్లకు, ఎరువులు పురుగు మందులకు సబ్సిడీలు ఇస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కొనుగోలు కేంద్రాలను సీజన్ ప్రారంభానికి ముందే ఏర్పాటు చేస్తామని ఊదరగొట్టారని వాస్తవంలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ హామీల అమలుపై వచ్చిన అంశాలను పరిశీలిస్తే రైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి మాత్రమే ఇచ్చిన హామీలుగానే పరిగణిస్తున్నారని నిర్ధారణకు వచ్చినట్లు తెలిపారు. 11 రకాల పంటల్లో మొదటి అంశం ధాన్యం సేకరణకు క్వింటాలకు రూ.500 బోనస్ మోసపూరితమైందని, దొడ్డు రకానికి ఇవ్వకుండా ఎగ కొట్టడమే దీనికి ఉదాహరణ అన్నారు. సన్న రకాల ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వవలసి వస్తుందని కొనుగోలు కేంద్రాలను చాలా ఆలస్యంగా పని ప్రారంభింపచేశారని, రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకున్న తర్వాత తాము నిర్ధారణకు వస్తున్నామని తెలిపారు. చౌట్‌పల్లి రైతు సహకార సంఘం ఆధ్వర్యంలో బషీరాబాద్ కొనుగోలు కేంద్రాలను నవంబర్ 24న ప్రారంభించడమే చక్కని ఉదాహరణ అన్నారు. ఒకవైపు అకాల వర్షాలు, తేమ శాతం ఎక్కువ ఉందని కొనుగోలు కేంద్రాల వారు సన్నధాన్యాన్ని కొనుగోలు చేయడానికి అనేక కొర్రీలు పెడుతున్నారన్నారు. రుణమాఫీని ఎలాంటి షరతులు లేకుండా వెంటనే పూర్తి చేయాలి అన్నారు. సమావేశంలో సిపిఐఎంఎల్ మాస్‌లైన్ కమ్మర్‌పల్లి మండల కార్యదర్శి కిషన్, జిల్లా నాయకులు బాబన్న, బాలన్న, సత్యక్క తదితరులు పాల్గొన్నారు.

లింబాద్రి గుట్ట ఆలయ హుండీ లెక్కింపు


హుండి ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నవతెలంగాణ-భీంగల్ రూరల్
భీంగల్ మండల కేంద్రంలోని శ్రీ నింబాచాల లక్ష్మీనరసింహస్వామి జాతర జరిగిన మూడు రోజుల ఉత్సవాల్లో సమకూరిన హుండీ ఆదాయాన్ని ఎండోమెంట్ పరిశీలకురాలు కమల ఆధ్వర్యంలో ఆదివారం లెక్కించారు. హుండీ ఆదాయం మొత్తం రూ.14.85 లక్షలు, అన్నదాన హుండీ రూ.6.06 లక్షలు, బంగారం 13.50 గ్రాములు, వెండి 670 గ్రాములు వచ్చినట్లు ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారథి తెలిపారు. ఈ మొత్తాన్ని స్వామివారి ఖాతాలో జమ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరం


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-భీంగల్ రూరల్
భవన నిర్మాణ, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల కోసం నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సిఎస్‌సి హెల్త్ కేర్ నిజామాబాద్ డిఎమ్ శశికాంత్, డిస్టిక్ మేనేజర్, సీసీ కాలిమ్, క్యాంప్ కోఆర్డినేటర్, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని జాగిర్యాల గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా కామన్ సర్వీస్ సెంటర్ (సిఎస్‌సి) హెల్త్ కేర్ ఆధ్వర్యంలో లేబర్ కార్డు కలిగిన నిర్మాణ రంగం కార్మికులకు కార్మిక సంక్షేమ శాఖ జారీచేసిన లేబర్ కార్డు ఉన్నవారు పరీక్షలు చేయించుకునేందుకు అర్హులని తెలిపారు. కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య పరీక్షలకు వచ్చేటప్పుడు లేబర్ కార్డుతో పాటు ఆధార్ కార్డు వెంట తీసుకుని రావాలన్నారు. భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులు కూలీ పని, తాపీ మేస్త్రీ, ఫ్లంబర్, టైల్స్, పాల్ సీలింగ్, ఎలక్ట్రీషన్, కార్పెంటర్, పేయింటర్స్, బ్రిక్స్ వర్కర్స్, గ్లాస్ వర్కర్స్ తదితర కార్మికులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేయనున్నట్టు వివరించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ


జలాల్‌పూర్‌లో చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని శ్రీరాంపూర్, జలాల్‌పూర్, నాగపూర్, వన్నెల్.బి, బోదెపల్లి, కిసాన్‌నగర్ గ్రామాలలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బీఆర్ఎస్ పార్టీ నాయకులు లబ్ధిదారులకు ఆదివారం అందజేశారు. మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సహకారంతో చెక్కులు మంజూరైనట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత మహిళకు ఆర్థిక సహాయం

నవతెలంగాణ-ఏర్గట్ల



మండల కేంద్రానికి చెందిన అఫ్రాఫ్ బీ అనారోగ్యం కారణంగా ఆపరేషన్ చేయించుకోగా.. ఈ విషయాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు బాల్కొండ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళడంతో.. స్పందించిన ఆయన నిరుపేద మహిళకు రూ.10 వేలు ఆర్థిక సహాయంగా పంపడంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు మహిళకు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్, డీసీసీ డెలిగేట్ గడ్డం జీవన్, కిసాన్ ఖేత్ మండలాధ్యక్షులు ముస్కు మోహన్ రెడ్డి, నాయకులు రేండ్ల రాజారెడ్డి, బొర్రన్న, బద్దం లింగారెడ్డి, కల్లెడ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

వెచ్చవెచ్చగా..

- గంజ్‌లో దుకాణాలు ఏర్పాటు చేసిన టిబెట్ వ్యాపారులు
- చలితీవ్రత పెరగడంతో జోరుగా స్వెటర్ల అమ్మకం


టిబెట్ వ్యాపారులు ఏర్పాటు చేసిన దుకాణాలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



చలికాలం వచ్చేసింది. వారం నుంచి చలి తీవ్రత బాగా పెరిగిపోవడంతో ప్రజలు చలి నుంచి రక్షించుకునేందుకు గానూ స్వెటర్లు, మంకీ క్యాపులను విరివిగా కొనుగోలు చేస్తున్నారు. దీంతో వాటిని డిమాండ్ నెలకొంది. అయితే టిబెట్ నుంచి వచ్చిన వ్యాపారులు జిల్లా కేంద్రంలోని గంజ్‌లో దుకాణాలను ఏర్పాటు చేశారు. చిన్న నుంచి పెద్దల వరకూ చలి నుంచి కాపాడుకోవడానికి కావాల్సిన స్వెటర్లు, మంకీక్యాపులు, టవల్స్‌ను విక్రయిస్తున్నారు. చలి తీవ్రత పెరగడంతో వీటికి భారీ డిమాండ్ పెరిగింది.

కాలానికి అనుగుణంగా మనుషులు వివిధ రకాల దుస్తులను ధరిస్తుంటారు. అందులో భాగంగానే చలికాలం వచ్చిందంటే టిబెట్ వ్యాపారులు నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకుంటారు. అదేవిధంగా ఈ నవంబర్ నెలలో జిల్లా కేంద్రం చేరుకొని 20 రోజులు కావొస్తుంది. వ్యాపారులు వచ్చి 15 రోజులు అయినప్పటికీ చలి అంతగా లేకపోవడంతో గిరాకీ అంతంత మాత్రమంగానే ఉండేది. గత 4,5 రోజుల నుంచి చలి తీవ్రత పెరగడంతో స్వెటర్లు, మంకీ క్యాప్‌లు, మఫ్లర్‌లు, బ్లాంకెట్స్, శాలువాలను ప్రజలు పెద్దఎత్తున కొనుగోలు చేస్తున్నారని వ్యాపారులు చెబుతున్నారు.

ధరలు ఇలా..

సంవత్సరం పిల్లల వరకు స్వెటర్లు రూ.250 నుంచి 580 వరకు, 5 సంవత్సరాల పిల్లలకు రూ.380 నుంచి 620 వరకు, మహిళలకు రూ.330 నుంచి 1000వరకు, పురుషులకు 350 నుంచి 1450 వరకు ఉన్నాయి. మఫ్లర్‌లు స్త్రీలకు రూ.50 నుంచి 140 వరకు, పురుషులకు రూ.70, క్యాప్‌లు స్త్రీలకు రూ.70 నుంచి 120 వరకు, పురుషులకు రూ.70 నుంచి 140 వరకు అందుబాటు ధరల్లో ఉన్నాయి. స్వెటర్లు, క్యాప్‌లు, బ్లాంకెట్లు ఇతర వస్తువులన్నీ ఉలన్, ఫేదర్ ఉలన్‌తో తయారు చేసినవి మాత్రమే తాము విక్రయిస్తామని టిబెట్ వ్యాపారులు చెబుతున్నారు. నాణ్యమైన ఉలన్‌తో మాత్రమే తయారు చేస్తారని, నాణ్యతలో మన్నికలో ఎటువంటి తేడా ఉండదని అంటున్నారు. అందుకే వస్తువుల పైన ఫిక్స్‌డ్ ధరలను ఏర్పాటు చేసి అమ్మకం చేస్తున్నామని వారు చెబుతున్నారు.

నిజామాబాద్ జిల్లా వినియోగదారులపై నమ్మకంతో గత 40 సంవత్సరాల నుంచి నిజామాబాద్ జిల్లాలో చలికాలంలో వచ్చి స్వెటర్లను విక్రయిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే గత మూడు సంవత్సరాల నుంచి బస్టాండ్ ప్రాంతంలో కాకుండా గాంధీ గంజ్ ప్రాంతంలో అమ్మకం చేస్తున్నామని, తద్వారా 8 దుకాణాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న చిన్నపిల్లల వివిధ రకాల టోపీలు, స్వెటర్లు

కులమత ప్రభావాలతో
పేదలకు ఇబ్బందులు

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్
- మొదటి రోజు ప్రారంభమైన సీపీఐ(ఎం) శిక్షణ తరగతులు




మాట్లాడుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్.. హాజరైన ముఖ్య కార్యకర్తలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

కులమత ప్రభావాలతో పేద ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్ తెలిపారు. సీపీఐ(ఎం) కార్యకర్తల శిక్షణ తరగతులు మొదటి రోజు పార్టీ కార్యాలయంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముందుగా పార్టీ జెండాను ఎగరవేసిన అనంతరం శిక్షణ తరగతులను ప్రారంభించారు. 'పని - పద్ధతులు' అనే అంశంపై పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్ బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంట్లో ఉన్న మూఢనమ్మకాలు, కులమత ప్రభావాలతో పేద ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. శాస్త్రీయ దృక్పథంతో వాస్తవాలను గ్రహించే పద్ధతుల్లో ప్రజా సమస్యలను అర్థం చేసుకోవాలని ఆయన తెలిపారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు 'పార్టీ నిర్మాణం' అనే అంశంపై కార్యకర్తలకు వివరించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ.. సమాజంలో వర్గ పోరాటాల ద్వారా మాత్రమే ప్రజల అసలు నుంచి విముక్తి లభిస్తుందని వర్గ పోరాటాల నిర్మాణంలో కార్యకర్తలు చురుగ్గా పాల్గొని విప్లవ సాధన కోసం కృషి చేయాలని ఆయన అన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నూర్జహాన్, వెంకటేష్, శంకర్‌గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు నన్నేసాబ్, సుజాత, మోహన్‌రావు, విగ్నేష్, పార్టీ కార్యకర్తలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

29న ఆశాల చలో ఢిల్లీ

- సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్



మాట్లాడుతున్న నూర్జహాన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఆశాల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 29న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ కోరారు. ఆదివారం సిఐటియూ జిల్లా కార్యాలయంలో జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలతో ఓ వైపు ధరలు పెరుగుతుంటే మరో వైపు వేతనాలు పెంచకుండా పారితోషికాలతో, అధిక పనిభారంతో ఆశాలు సతమతమవుతున్నారని తెలిపారు. ఆశాలను కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26000 చెల్లించాలన్నారు. సామాజిక భద్రత నెలకు కనీసం రూ.10వేలు పెన్షన్‌గా చెల్లించాలని తెలిపారు. అదనపు పనులకు అదనంగా పారితోషికం చెల్లించాలని, దేశంలో అందరు ఆశాలకు ఒకేవిధమైన పని పరిస్థితులు కల్పించాలన్నారు. నాలుగు కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని, పోరాడి సాధించుకున్న పాత కార్మిక చట్టాలనే కొనసాగించాలని పేర్కొన్నారు. అనేక పోరాటాల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం నెలకు ఒక వెయ్యి (1000) రూపాయలు ఉన్న పారితోషికాన్ని 2000 రూపాయలకు పెంచి చెల్లిస్తుందని, ఇప్పుడున్న ధరలకు ఇది ఎంతమాత్రం సరిపోదని తెలిపారు. అన్ని రాష్ట్రాలలో ఇప్పుడు ఇస్తున్న పారితోషికాలు కూడా గతంలో నిర్ణయించినవే కాబట్టి అవి కూడా పెంచి ఇవ్వాలని కోరారు. ఆశాలకు పనిభారం తగ్గించాలని తదితర సమస్యల పరిష్కారం కోసం 29న జరిగే పార్లమెంటు మార్చ్ (చలో ఢిల్లీ) కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్‌హెచ్‌ఎంను శాశ్వత ఆరోగ్య కార్యక్రమంగా గుర్తించి, బడ్జెట్ కేటాయించి ఖర్చు చేయాలని, కనీస వేతనం, ఈఎస్‌ఐ, పిఎఫ్, సౌకర్యం కల్పించాలని, ఆరోగ్య రంగానికి 6శాతం కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశ యూనియన్ జిల్లా నాయకులు సుకన్య, రమ, లావణ్య, రేవతి, సువాసిని, రేణుక, లాస్య, వనిత, లావణ్య, నర్సు, శోభ, కల్పన, మానస, సబిత, ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ప లింగం తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ నమోదు కేంద్రాలను పరిశీలించిన సబ్ కలెక్టర్


అధికారులకు సూచనలు చేస్తున్న సబ్ కలెక్టర్

నవతెలంగాణ-పొతంగల్

మండలంలోని ఓటరు జాబితా ప్రత్యేక సవరణ-2025 కార్యక్రమంలో భాగంగా పొతంగల్ స్పెషల్ క్యాంపెయిన్‌ను బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి ఆదివారం సందర్శించి సలహాలు, సూచనలు చేశారు. 2025 జనవరి 1 నాటికి 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని సూచించారు. ఆమె వెంట ఉమ్మడి మండలాల్లోని తహసీల్దార్ మల్లయ్య, ఎంఈఓ శంకర్ తదితరులున్నారు.

నిందితుడి అరెస్టు

నవతెలంగాణ-పొతంగల్

మండలంలోని కోడిచర్ల గ్రామ శివారులో సిరుపూర్ రహదారి పక్కన రెవెన్యూ చెక్‌పోస్టును ఈ నెల 18న దహనం చేసిన కేసులో నిందితుడిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. డోంగ్లి మండలంలోని సిర్పూర్ గ్రామానికి చెందిన షేక్ అమద్ (44), ఆటో డ్రైవర్‌ను విచారించగా అతను నేరం ఒప్పుకున్నాడు. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ సందీప్ తెలిపారు.

సొంత ఖర్చులతో రోడ్డు మరమ్మతులు

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని సాయికుంట వద్ద గల వ్యవసాయ క్షేత్రాలలో గత వర్షాకాలంలో వర్షాలకు రోడ్డు మొత్తం దెబ్బతిని పెద్ద గుంతలుగా ఏర్పడ్డాయి. ఈ సమస్యపై కాంగ్రెస్ నాయకులకు విన్నవించగా వారు స్పందించి తమ సొంత ఖర్చులతో జెసిబితో రోడ్డు మరమ్మతు పనులను ఆదివారం చేయించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు సంజీవ్‌గౌడ్, బండి మల్లేష్ యాదవ్, కుంట సంతోష్‌గౌడ్, కుమ్మరి గంగాధర్, ధర్మాయి రాజేందర్, మోహన్, నాగేష్, గువ్వల కిషన్, పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో క్లీన్ అండ్ గ్రీన్


క్లీన్ అండ్ గ్రీన్ నిర్వహిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో పాములు పోలీస్ స్టేషన్‌లోకి రావడంతో ఎస్సై సిబ్బందితో కలిసి చెత్తచెదారాన్ని ఒక చోట కుప్పచేసి కాల్చివేశారు. కార్యక్రమంలో ఎస్సై తిరుపతి, ఏఎస్ఐ వెంకటి, పోలీస్ సిబ్బంది కానిస్టేబుల్, తదితరులు పాల్గొన్నారు.

డాటాను తప్పులు లేకుండా నమోదు చేయాలి

- ఆర్డీవో రాజాగౌడ్
- సర్వే నమోదు ప్రక్రియ పరిశీలన


సర్వే నమోదును పరిశీలిస్తున్న ఆర్డీవో

నవతెలంగాణ-బాల్కొండ

సమగ్ర కుటుంబ సర్వే ఆన్‌లైన్ డాటా నమోదు ప్రక్రియను తప్పులు లేకుండా నమోదు చేయాలని ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో చేపట్టిన డాటా ఎంట్రీ కేంద్రాన్ని ఆర్డీవో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంప్యూటర్ ఆపరేటర్లు, డాటా ఎంట్రీ సిబ్బంది ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా సమగ్ర కుటుంబ సర్వే వివరాలు నమోదు చేయాలని, ఏవైనా సమస్యలుంటే అధికారులను సంప్రదించాలని సూచించారు. మండల అధికారులు ఎప్పటికప్పుడు నమోదు ప్రక్రియను పరిశీలించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీఓ గంగా మోహన్, ఆర్ఐ భరత్, ఏఎస్ఓ ప్రశాంత్, తదితరులున్నారు.

గడుగు గంగాధర్‌ను సన్మానించిన ఏఈవోలు

నవతెలంగాణ-కంఠేశ్వర్



వ్యవసాయ విస్తరణ అధికారుల(ఏఈవో) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు గడుగ గంగాధర్‌ను నిజామాబాద్‌లోని ఆయన నివాసంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఐక్య వేదిక అధ్యక్షుడు రాజ్‌కుమార్ బదావత్ మాట్లాడుతూ.. శాఖలో నూతనోత్తేజాన్ని నింపే దిశగా, వ్యవసాయ విస్తరణను పటిష్టం చేసే ఉద్దేశంతో ఆదర్శ రైతు వ్యవస్థ పునరుద్ధరణ, ఆత్మ కమిటీల నియామకం కోసం కృషి చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదర్శ రైతులు వ్యవసాయ శాఖతో మమేకమై కలిసి పనిచేసే విధంగా వారికి జాబ్ చార్ట్, కనీస విద్యార్హతలు, కనీస గౌరవ భృతి ఉండే విధంగా కృషి చేయాలని గడుగు గంగాధర్‌ను ఏఈవోలు కోరారు. ఐక్య వేదిక అధ్యక్షుడితోపాటు నిర్మల్, నిజామాబాద్ జిల్లాల ఏఈవోలు రాజు నాయక్, నృపేష్, జ్ఞానేశ్వర్, చక్రపాణి, శరత్, సంధ్య రేఖ, కృష్ణ రెడ్డి, రాజా తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువలు నేర్పాలి

- రేపు భారత రాజ్యాంగ దినోత్సవం

నవతెలంగాణ-ఆర్మూర్



నేటి బాలలే రేపటి పౌరులు. దేశ జనాభాలో 15 ఏళ్లలోపు ఉన్న బాలలు 36 కోట్లు. దేశ జనాభాలో వీరు 25.4శాతం. భవిష్యత్తు భారత వాణి ముఖచిత్రాన్ని మార్చే మూల స్తంభాలే ఈ చిన్నారులు. రేపు భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నవతెలంగాణ కథనం.

2015 నవంబర్ 26 నుంచి...

1949 నవంబర్ 26న భారత రాజ్యాంగ సభ అధికారికంగా భారత రాజ్యాంగాన్ని ఆమోదించింది. రాజ్యాంగ విలువల పట్ల దేశ ప్రజల్లో గౌరవ భావాన్ని పెంపొందించడానికి 2015 నవంబర్ 26 నుంచి ప్రతి ఏటా భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

అమలులోకి వచ్చి74 సంవత్సరాలు..

భారత రాజ్యాంగం ప్రాముఖ్యతను తెలియజేయడానికి బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనలు భావవ్యక్తి కోసం నవంబర్ 26న భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించు కుంటున్నాం. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 74 సంవత్సరాలు పూర్తి అయింది. దేశంలో భిన్నత్వంలో ఏకత్వం కొనసాగడానికి రాజ్యాంగం ఎంతో దోహదపడుతుంది. ప్రతి ప్రభుత్వానికి రాజ్యాంగం అతి ముఖ్యమైనది.

తెలంగాణ బాలలకు..

బాల్యం నుంచే భారత రాజ్యాంగంపై గౌరవం మౌలిక లక్ష్యాలను ఆచరించాలని ఆలోచన బాలల్లో పెరుగుతుంది. బాలల్లో రాజ్యాంగ విలువలు లక్ష్యాల మీద పూర్తి అవగాహన కల్పించటం వల్ల వారిని అత్యుత్తమ పౌరులుగా తీర్చిదిద్ది భవిష్యత్ తరానికి అందించిన వారవుతాం. రాజ్యాంగ రచయితల ఆశయ సాధనకు మనం కృషి చేసిన వారం అవుతాం. సెప్టెంబర్ 23 నుంచి కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ బడుల్లో, కళాశాలలో ప్రార్థన సమయంలో విద్యార్థులు ప్రతిరోజు భారత రాజ్యాంగ ప్రవేశిక విధిగా చదవాలని నిర్ణయించి అమలు చేస్తున్నది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని బాలల్లో భారత రాజ్యాంగ విలువల పెంపుపై నిర్ణయం తీసుకొని రాజ్యాంగ మౌలిక లక్ష్యసాధన కోసం రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో కళాశాలలో ప్రార్థన సమయంలో ప్రతిజ్ఞ చేయించేలా చర్యలు తీసుకోవాలని, తెలంగాణ పౌరులను భారతదేశంలోనే అత్యున్నత విలువలు గల వ్యక్తులుగా తీర్చిదిద్దే ప్రయత్నం రేవంత్ రెడ్డి సర్కార్ చేయాలని పలువురు విద్యావేత్తలు అంటున్నారు.

అణగారిన వర్గాల, పీడిత ప్రజల..

రాజ్యాంగం అంటే కేవలం ప్రభుత్వ విధి విధానాలే కాదు అణగారిన వర్గాల పీడిత ప్రజల ఆశయాలను ఆకాంక్షలను ప్రతిబింబించేలా ఉండాలన్నది అంబేద్కర్ ఆశయం. ఆయన కృషి ఫలితంగానే ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి నూతన రాజ్యాంగం రూపొందించబడింది. నవభారత నిర్మాత బి.ఆర్ అంబేద్కర్ చెప్పినట్లు ఆశయాలను ఆచరణలో పెడితే మానవుడే మహనీయుడు అవుతాడు. భారతదేశ ప్రజలందరి ఆశయాలు ఆకాంక్షల కూర్పే మన రాజ్యాంగం. భారత రాజ్యాంగాన్ని పరిరక్షించడం మనందరి బాధ్యత. దేశ ప్రజలందరూ ఇష్టపూర్వకంగా ఒప్పుకొని ఆమోదించుకున్న నియమాలు, ప్రతిజ్ఞలు, హక్కులు, బాధ్యతల సమాహారమే భారత రాజ్యాంగం.

బాలలకు రాజ్యాంగ విలువలు నేర్పాలి



భారత రాజ్యాంగం ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులు, ఆదేశ సూత్రాలతో దేశ ప్రజలందరూ ఒక్కటే అని చాటి చెప్పాలి. నేటి బాలల్లో చిన్ననాటి నుంచే భారత రాజ్యాంగ విలువలు పెంపొందించడానికి ప్రజలంతా ఒకటే అనే భావన కల్పించడానికి బాలలకు భారత రాజ్యాంగ విలువలు నేర్పాలి.

- రజినీకాంత్, ఆలూరు.

సామాజిక, ఆర్థిక అంతరాలు ఉండవద్దు



మనుషుల మధ్య ఉన్న సామాజిక ఆర్థిక అంతరాలు మనుషులను దూరం చేయకూడదు. సమతా భావం పెంపొందించుటకు రాజ్యాంగ విలువలు నేర్పాలి. బాల్యం నుంచి అవగాహన కల్పించేందుకు పాఠశాలల్లో, కళాశాలలో ప్రార్థన సమయాలలో విధిగా భారత రాజ్యాంగ ప్రవేశికపై ప్రతిజ్ఞ చేయించాలి.

- దుబ్బాక రవికుమార్, లాయర్, గుత్ప.